అవకాశంలేదు. ఏ వస్తువు తనంతట తానుగా ప్రకాశిస్తుందో, ఏ ప్రకాశం వలన ఈ ప్రపంచం తెలియబడుతోందో నీ మనస్సును దానిమీదపెట్టి ధ్యానిస్తే కదా ఈ రాగద్వేషములనుండి బయటకువచ్చేది. ఈశ్వరుడిని ధ్యానిస్తూ ఉంటే అహంభావన రాలిపోతుంది. సూర్యుడు ఉదయించటం, చీకటి పోవటం ఎలా జరుగుతుందో, అలాగ శవబుద్ధి నశించటం శివబుద్ధి కలగటం ఒకేసారి జరుగుతుంది. మన స్వరూపమే బ్రహ్మం, మన పేరే బ్రహ్మం, మనం బ్రహ్మం అయిఉండి బ్రహ్మంను వెతుక్కొంటున్నాము, నీవు బ్రహ్మమే అది తెలియక ఇలా వెతుక్కుంటున్నావు అని మనకు తెలియజెప్పేవాడే గురువు. మన హృదయంలో ఉన్న చైతన్యం మనకు తెలియకుండా ఏదో అడ్డువస్తోంది అని నీవు అనుకొంటున్నావు. ఏదీ అడ్డురావటం లేదు, అది కూడా ఒక తలంపే, అది కూడా కల్పితమే. ఈ కల్పిత గొడవలు తీసి ఒక ప్రక్కన పెట్టు, అదే సాధన. నీకు జ్ఞానం కలిగే రోజు వచ్చేస్తుంది, నీకు జ్ఞానం కలిగాక ఈ గొడవలు అన్నీ కల్పితాలు, నేను చేసిన సాధన కల్పితం అని నీకు తెలుస్తుంది. భగవాన్‌తో ఒక భక్తుడు నేను బాగా సాధన చేస్తున్నాను అన్నాడు. భగవాన్ అంటారు సాధన చెయ్యి, సాధన చెయ్యి సాధనలో ఏమీలేదు అని తెలిసేవరకూ సాధన చెయ్యి. జ్ఞాపకం సంసారం, మరపు సంసారం. ఎందుచేతనంటే జ్ఞాపకం పెట్టుకొనేది మనస్సు, మర్చిపోయేది మనస్సు. ఈ మనస్సే సంసారం. ఎవరైనా కాశీ వెళతాను అంటే వెళ్ళిరండి అక్కడ ఏమీలేదు అని తెలుసుకోవటానికి వెళ్ళిరండి అనేవారు. ఉన్నదంతా నీహృదయంలోనే ఉంది, బయట ఏమీలేదు అనే వారు. నీ వాసన వలన బయట ఏదో ఉందని నీకు అనిపిస్తోంది అంతే గాని బయట ఏమీలేదు. 24 గంటలు ప్రపంచాన్ని తలపెట్టుకొనే బదులు నిర్మలంగా కూర్చొని కొద్దిసేపు భగవంతుని ధ్యానించుకోవటం వలన నీకు ఎక్కువ విషయాలు తెలుస్తాయి. 1912 సం॥లో విరూపాక్ష గుహలో మొదట భగవాన్ పుట్టిన రోజు జరిగింది. మీ పుట్టిన రోజుచేసుకొంటాము అని భక్తులు భగవాన్‌ను అడిగితే ఈ శరీరం పుట్టినరోజు కాదు చేయవలసింది, ఈ శరీరము అనే తలంపు ఎక్కడపుడుతోంది అని దాని మూలాన్ని వెతకటం పుట్టిన రోజు యొక్క లక్ష్యం అన్నారు. నువ్వు 365 రోజులు విచారణ చేయటం మంచిదే. నువ్వు అలా చేయలేకపోతే కనీసం ఈ దేహం పుట్టినరోజున అయిన ఈ నేనుఅనే తలంపు ఎక్కడ పుట్టి వస్తోందో దానిని విచారణ చెయ్యి, ఇలా విచారణ చేయటమే నిజమైన పుట్టినరోజు అన్నారు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-12-2002, పూలపల్లి**

**20-01-2003**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నువ్వు జీవించిఉన్నంతకాలం నీవు చేయగలిగినంత మంచి చేస్తూఉండు. సత్పురుషులను చూసూఉంటే ఇదే వైకుంఠం అనిపిస్తుంది, కొంతమందికి ఆ వైభవాన్ని గ్రహించేశక్తిలేక ఇక్కడ ఉన్నదానిని వదిలేసి ఎక్కడో ఏదోచూస్తూ ఉంటారు. సత్వగుణం ఉన్నవారు ధన్యులు, వారు ఎక్కడికి వెళ్ళినా స్వతంత్రించుకొందురు అంటే వారు ఏదేశం వెళ్ళినా అది మనదేశమే అని వారికి అనిపిస్తుంది. అంటే మన దృష్టి అంత విశాలం అవ్వాలి. మన దృష్టి అంత విశాలమైతే అహంభావన పోతుంది. ఈ సృష్టిలో ఏదీ నాదికాదు అనుకోవటం జ్ఞానమార్గం, కనిపిస్తున్న జగత్తు అంతా నాది అనుకోవటం కర్మమార్గం. ధనం నీకు యజమానిగా ఉండకూడదు, ధనం నీకు బానిసగా ఉండాలి. ధనం నీకు యజమానిగా ఉంటే, ధనం మన మీద పెత్తనం చేస్తూఉంటే మనం మంచి పనులు చేయలేము, మన పతనం ప్రారంభమవుతుంది. ధనం మనకు బానిసగా ఉంటే మనం మంచి పనులు చేయగలము, మనం వినయంగా ఉంటాము, శాంత చిత్తముతో ఉంటాము. ధనం మనకు యజమానిగా ఉంటే అది పాపాన్ని తీసుకొని వస్తుంది. ధనం మనకు బానిసగా ఉంటే అది పుణ్యాన్ని తీసుకొని వస్తుంది. సూదిబెజ్జంలోనుండి ఒంటెను లాగగలము గాని ధనవంతుడిని స్వర్గంలోనికి పంపలేము అని బైబిలులో చెప్పాడు. ఎక్కడ ధనం ఉందో అక్కడ చెడువచ్చే అవకాశం ఉంది, అందువలన బహుజాగ్రత్తగా ఉండు అని భగవంతుడు చెప్పాడు. మనం సాధన చేసి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. సత్వగుణాన్ని సాధించలేకపోతే ఆత్మజ్ఞానసముపార్జనకు దారి కనబడదు, ఏపని చేసినా యజ్ఞభావంతో చేయాలి. చేతులతో పని చేయాలి, మనస్సుకు యజ్ఞభావం ఉండాలి. యజ్ఞభావనతో పనిచేసేవాడు పూర్ణస్థితిని పొందుతాడు. తిండిదగ్గర, నిద్ర దగ్గర అతిలేకుండా జాగ్రత్తగా ఉంటే అది శారీరకఆరోగ్యానికి మంచిది. మాటదగ్గర జాగ్రత్తగా ఉంటే అది మానసిక ఆరోగ్యానికి మంచిది. మనకు ఈ రెండు ఆరోగ్యాలు అవసరమే, ఇవి సరిగా లేకపోతే సత్యాన్వేషణ జరగదు. సత్యాన్వేషణ చేసే వారందరికి వెంటనే సత్యానుభవం కలుగకపోవచ్చు కాని అపజయం కూడా జయానికి దారితీస్తుంది. మనకు జిజ్ఞాస ఉంది, ప్రయత్నం చేస్తున్నాము, పడుతున్నాము మరల లేస్తున్నాము. కాలు జారిపడతాము అనుకోండి అలా

కూర్చొని ఉండిపోతామా, మరల లేచి నడవటానికి ప్రయత్నం చేస్తాము. అలాగే జీవితంలోఅనేక అపజయాలు రావచ్చు. జయం సంపాదించటానికి అనుగుణంగా అపజయాలను మళ్లించుకోవాలి. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. అందుచేత మీరు చేసిన సాధన ఊరికేపోదు, ఈ జన్మలో ఆత్మసాక్షాత్కారం పొందకపోయినా మీరు చేసిన సాధన రాబోయే జన్మలో కంటిన్యూ అవుతుంది. ఇతరులకు మీరు ఏదైనా సహాయసహకారములు అందిస్తే అవి తిరిగి మీకే వస్తాయి అన్న సంగతి మీకు తెలిస్తే ఇతరులకు చేయకుండా ఎలా ఉండగలరు. నీవు కర్మఫలాన్ని ఆశించకుండా ఉంటే నీకు వికారమే లేదు అని భగవంతుడు చెపుతున్నాడు. చేసే స్నేహాల విషయంలో, చదివే గ్రంధాల విషయంలో అజాగ్రత్త పనికిరాదు. సజ్జనసాంగత్యం వలన మనకు వైరాగ్యం కలుగుతుంది, అభ్యాసం చేయాలి, గమ్యానికి చేరుకోవాలి అనే తపన కలుగుతుంది, అభ్యాసం, వైరాగ్యం ఈ రెండూ విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. మనం సమాజానికి ఎంతవరకు ఉపయోగపడగలమో అంతవరకు కర్తలేని కర్మను చెయ్యాలి. కర్తృత్వం లేకుండా, నిర్మలమైన మనస్సుతో, నిగ్రహంగా పనిచేయాలి. నిగ్రహం తక్కువ ఉన్నవాడికి ఆగ్రహం ఎక్కువ ఉంటుంది. హెచ్చు తగ్గులు లేకుండా ఎవరి జీవితం ఉండదు. జయాన్ని, అపజయాన్ని సమానంగా తీసుకో అని

**జ్ఞానమంటే సత్యాన్ని అనుభూతం చేసుకోడమే. అది ధ్యానం వలననే సాధ్యమవుతుంది. ఇతర భావాలన్నింటినీ వర్జించి సత్యాన్ని అనుభూతం చేసుకోడానికి తోడ్పడుతుంది ధ్యానం.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

భగవంతుడు చెపుతున్నాడు, సమానంగా తీసుకొనే శక్తి నీకు లేకపోతే దానిని సంపాదించుకోవాలి. వాటిని సమానంగా తీసుకొనే శక్తి నీకు లేకపోతే మనస్సుకు లోచూపు కలుగదు.

మనం నేను, నేను అంటున్నాము. మనకు దేహం తెలుస్తోంది. దేహంనేను అని అనదు. లోపల చైతన్యం ఉంది, వారు ఏమీ అనరు. మరి నేను, నేను అని ఎవరు అంటున్నారు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది ఒక తలంపు. అది నీకు బయటనుండి రావటం లేదు, లోపల నుండే వస్తోంది. నీకు గాఢనిద్రలో ఉండగా నేను అనే తలంపు లేదు. జాగ్రదవస్థలో ఉండగా నేను అనే తలంపు వస్తోంది. కాని జాగ్రదవస్థలోను, గాఢనిద్రలోను కూడా నీవు ఉన్నావు. జాగ్రదవస్థలోను, గాఢనిద్రలోను ఉన్న నువ్వు నిజమా? లేక జాగ్రదవస్థలో ఉండిగాఢనిద్రలో పత్తాలేకుండా పోయే ఆ నేను నిజమా? నేను అనేది

**మోక్షమనగా నీవు పుట్టనివాడివని తెలుసుకోడమే, నిశ్చలత్వము పొంది, 'నేనే బ్రహ్మము' నని తెలుసుకో. నిశ్చలత్వము పొందడమంటే మనోభావనలేవీ లేకుండా ఉండడం. కావలసినది 'తెలుసుకోడం' గాని 'భావించడం' కాదు.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

ఒక తలంపు మాత్రమే, అది నిజం కాదు. నీకు ఎన్నితలంపులు వచ్చినా నేను అనే తలంపుకే వస్తున్నాయి. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఇవి అన్నీ నేను అనే తలంపు కల్పితములే. నేను అనే తలంపు ఎంతనిజమో అది కల్పించే విషయాలు కూడా అంతేనిజం. మన గుణాలు వేరు, రంగులు వేరు, వృత్తులు వేరు. ఈ తేడాలు, తంటాలు అన్నీ తీసుకొని వచ్చేది నేను అనే మూలతలంపు. ఆ మూలతలంపును శోధించు. ఆ మూలతలంపు మూలాన్ని సాధించు ఇదే రమణసందేశం. నువ్వు ఈ మూలతలంపును మినహాయించి సాధన చేస్తున్నావు. అలాకాదు నీ సాధనలో ఆ మూలతలంపును ఇన్‌వాల్వ్ చెయ్యి. ఏది వచ్చిన తరువాత మిగతావి అన్నీ వస్తున్నాయో ఆ మూలతలంపు అనే సమస్యను నీవు పరిష్కారం చేసుకోవటం లేదు. నువ్వు భక్తిమార్గంలోగాని, కర్మమార్గంలోగాని, ధ్యానమార్గంలోగాని ఏదో ఒక మార్గంలో ప్రయాణించి ఈ సమస్యను పరిష్కారం చేసుకో. నీకు ఎన్నితలంపులు వచ్చినా కంగారుపడవద్దు. ఇవి అన్నీ నేను అనే తలంపుకే వస్తున్నాయి. అది ఎక్కడనుండి వస్తోంది, ఇది మీరు అర్థం చేసుకోండి. ఎక్కడయితే భగవంతుడు ఉన్నాడో అక్కడ నుండే ఈ తలంపు వస్తోంది. ఈ మూలతలంపును పట్టుకొని, దానిని శోధించి దాని మూలంలోనికి వెడితే ఈ మూలతలంపు అదృశ్యమవుతుంది, మూలతలంపు మూలంలో ఉన్న బ్రహ్మం నీకు తానుగా వ్యక్తమవుతుంది. ఆత్మవిచారణ కాలక్షేపం కోసంకాదు, ఆత్మసాక్షాత్కారం కోసం. ఆత్మనుదర్శించటం అంటే కళ్ళతో చూడటం కాదు, ఆత్మగా ఉండటం. ఇప్పుడు మీరు శరీరంగాను, మనస్సుగాను ఎలా ఉంటున్నారో అలాగ ఆత్మగా ఉండాలి. ఆత్మ ఎలా ఉంటుంది? అది శాంతిగా ఉంటుంది. ఆనందంగా ఉంటుంది, సౌందర్యంగా ఉంటుంది, సరళంగా ఉంటుంది దేహం ఉండటం పోవటంతో దానికి పనిలేదు, అది సహజంగా ఉంటుంది. ఆ స్థితికి నీవు వెళ్ళాలి, అదే నీ జీవితగమ్యం. ఇప్పుడు నీకు మూలతలంపు తెలుస్తోంది. అది ఎక్కడకు వెళ్ళినా తంటాలు తెచ్చిపెడుతుంది. నీవు ఏదో మార్గంలో ప్రయాణించి మూలతలంపును దానిమూలంలోనికి పంపు. హృదయంయొక్క లోయల లోనికి నీవువెళ్ళగలిగితే అంత వైరాగ్యం నీకు ఉంటే, అంత అభ్యాసం నీకు ఉంటే, అంత లోతులలోనికి దిగేశక్తి నీకు ఉంటే మూలతలంపు మూలం నీకు తెలుస్తుంది. మనస్సును ఎలా నిగ్రహించుకోవాలి అని అడిగితే అసలు మనస్సు ఉందో, లేదో ముందు నువ్వు చూసుకో. మనస్సు లేకపోతే నిగ్రహించుకోవలసిన పనిలేదు, మనస్సు ఉంది అనుకో అప్పుడు నిగ్రహించుకోవటానికి ప్రయత్నించు. దేహంతో తాదాప్యంపొందే తలంపే మనస్సు దానిని



తీసి ఒక ప్రక్కన పెట్టు ఇంక మనస్సు అంటూ ఏమీలేదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అక్కడకు తీసుకొని వెళ్ళటానికి మహర్షి ప్రయత్నం చేస్తున్నారు. మీరు నిజంకాని దానిని నిజం అని నమ్ముతున్నారు. ఇలా అనేక జన్మలు వెళ్ళిపోతున్నాయి. తరువాత ఇది నిజంకాదు అని తెలుసుకొని మరల ప్రయాణం మొదలుపెట్టాలి. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు, శ్రమను విడిచిపెట్టవద్దు. భౌతికంగాగాని, ఆధ్యాత్మికంగాగాని శ్రమే ఫలితాన్ని తీసుకొని వస్తుంది. పనిని విడిచిపెట్టవద్దు. పని విడిచిపెడితే సోమరితనం వస్తుంది గాని జ్ఞానం రాదు. ఈసృష్టిలో రెండు రకాల మనుషులు ఉన్నారని రామకృష్ణ పరమహంస చెప్పారు. కొంతమంది చేటలు, కొంతమంది జల్లెడలు అన్నారు. చేట చెడ్డను వదిలేస్తుంది, మంచిని పట్టుకొంటుంది. సాధకుడు చేటలా ఉండాలి కాని జల్లెడలా ఉండకూడదు. జల్లెడ మంచిని వదిలేసి చెడ్డను దగ్గరపెట్టుకొంటుంది. మీకు జ్ఞానం కావాలంటే చేటలా ఉండాలి.

మనం ఒంటరిగా ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటాము, పది మందితో ఉన్నప్పుడు ఒక రకంగా ఉంటాము. అంటే మనది సహజస్థితి కాదు. మనం పూజగదిలో ఉన్నప్పుడు ఎలా ఉంటున్నామో వందమందిలో ఉన్నప్పుడు కూడా అలా ఉండగలగాలి. అలా ఉండలేకపోతే అజ్ఞానం అక్కడ పనిచేస్తోంది అని గుర్తు. ఏదో కొద్దిసేపు పూజ చేసుకొని బయటకు వచ్చారు అనుకోండి. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే సంతోషం, ఎవరైనా విమర్శిస్తే దుఃఖం వస్తోంది అనుకోండి మీరు చేసిన పూజ ఎక్కడకు వెళ్ళిపోయింది. పూజ చేయటం ద్వారా మీరు ఏమి సాధిస్తున్నారు అంటున్నాను. ఆ పూజ చేసే నేనును, జపం చేసే నేనును, ధ్యానంచేసే నేనును ఎప్పుడైనా పరిశీలించారా? దానిని ఎప్పుడైనా శోధించారా? మూలతలంపు మూలంలోనికి వెళ్ళటం నేర్చుకొన్నారా? పోనీ ఆ మార్గంలో మీరు తరించకపోయినా జ్ఞానమార్గంలో ప్రయాణం చేయాలనే స్థిరత్వం, ధృడనిశ్చయం మీలో ఎవరికైనా ఉందా? అసలు ఆ ఎనాలసిస్ మీకు లేదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహబుద్ధిలోనుండి విడుదలపొందాలి. దేహబుద్ధిలోనుండి విడుదల పొందకపోతే అజ్ఞానం, దుఃఖం, అశాంతి మిమ్మలను వెంటాడుతుంది. సోదర మహాశయులారా! ఒకటి గుర్తు పెట్టుకోండి. మీరు మూలతలంపు మూలంలోనికి వెళ్ళలేదు అనుకోండి, దుఃఖం తాలుక దుంప ఎండిపోదు, నశించదు. అది అలాగే ఉండిపోతుంది. మూలతలంపు మూలంలోనికి వెళితేగాని దుఃఖం తాలుక దుంప ఎండదు, నశించదు. ఆ దుంప పచ్చగా

ఉన్నంతకాలం నీవు ఎన్ని జన్మలు ఎత్తినా జన్మజన్మలకు దుఃఖం, అశాంతి నిన్ను వెంటాడుతుంది, ఆందోళన నిన్ను వెంటాడుతుంది, నీవు శవాలను మోస్తూ ఉండవలసిందే. లోపల దు:ఖం తాలుక దుంప పెట్టుకొని ఏదో జపం చేసి, పూజ చేసి తాత్కాలికంగా పది నిముషాలు శాంతిగా ఉంటే సమాధిస్థితికి జానెడు దూరంలో ఉన్నామని, ఆత్మజ్ఞానానికి జానెడు దూరంలో ఉన్నామని ఎంతకాలం మనలను మనం మోసం చేసుకొంటాము. నేను అనే మూలతలంపు చైతన్యసాగరంలో నుండి వచ్చిన ఒక బుడగ వంటిది. బుడగ పగిలిపోతే సముద్రంలో కలిసిపోతుంది. అలాగే నేను అనే తలంపు పోతే నీవు పోవు, నీవు ఏదిగా ఉన్నావో అది అవుతావు, జ్ఞానమే నాకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మూలతలంపు మూలంలో నీవు ఐక్యమైనప్పుడు, ఆ ఆనందసాగరంలోనీవు ఈదులాడుతున్నప్పుడు నీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందం ఒక్కసారి పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. అద్వైతసంస్కారం కలగటానికి ఎన్నోజన్మల పుణ్యబలం నీకు ఉండాలి. ద్వైతం కూడా మంచిదే. ద్వైతం అద్వైతానికి దారి చూపిస్తుంది. విగ్రహం మంచిదే ఎంతవరకు అంటే నీకు నిగ్రహం తీసుకొని వచ్చే వరకు విగ్రహం మంచిదే. విగ్రహారాధన వలన మీకు కామక్రోధములు తగ్గుతూ ఉంటే విగ్రహారాధన మంచిదే. కాని అసలు సమస్య పరిష్కారం కాదు. మూలతలంపును వదిలేసి నీవు ఎన్నిసాధనలు చేసినా తాత్కాలికంగా నీకు శాంతిగా ఉండవచ్చు గాని గమ్యాన్ని చేరలేవు. నీ మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు, మనస్సును స్నేహితునిగా చేసుకొని మనస్సుతో అనుకూలంగా ఉండి, దానిని మచ్చిక చేసుకొని మనోమూలంలోనికి వెళ్ళు అని భగవంతుడు చెపుతున్నాడు. ఇప్పుడు మనం చైతన్యంలోనే ఉన్నాము. మరి చైతన్యంలో ఉంటే సుఖంగా, శాంతిగా ఎందుకు ఉండలేక పోతున్నాము? మనం చైతన్యంలోనే ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటం లేదు అందుచేత దుఃఖం మనలను వెంటాడుతోంది. ఇది తెలుసుకుంటే సుఖం, తెలియకపోతే దుఃఖం.

ఇప్పుడు మీకు ఏదో ఒక తలంపు వస్తుంది, వెంటనే దుఃఖం వస్తుంది. మరల ఇంకో తలంపు వస్తుంది, సంతోషం వస్తుంది. జీవితంలో మీకు అనుకూలపరిస్థితులు ఉంటాయి, ప్రతికూలపరిస్థితులు ఉంటాయి. ఈ పరిస్థితులు అన్నీ చక్కబెట్టుకొన్నాక సాధన చేద్దామనుకోవద్దు. పరిస్థితుల మధ్యలోనే మనం సాధన చేసుకొంటూ వెళ్ళాలి, సమస్యలమధ్యలోనే మనం సాధన చేసుకొంటూ వెళ్ళాలి. సముద్రంలో కెరటాలు తగ్గాక స్నానం చేద్దాము అనుకోవటం ఎటువంటిదో సమస్యలు అన్నీ చక్కబెట్టుకొన్నాక సాధన చేద్దామనుకోవటం అటువంటిదే అని స్వామీజీ చెప్పారు. కెరటం కెరటం మధ్యన స్నానంచేసి నీవు ఒడ్డుకురా అలాగే సమస్యకు సమస్యకు మధ్యసాధనచేసి మూలతలంపు మూలంలోనికి వెళ్ళు అంతేగాని సాధన విడిచిపెట్టవద్దు. నేను ఎవడను అని ప్రశ్నించుకొంటున్నాను కాని అర్థం తెలియటంలేదు అని అడుగుతున్నాడు. నువ్వు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేను అనేది నిజం కాదు. అది ఒక తలంపు. నీకు చాలా తలంపులు వస్తున్నాయి కదా కాని నేను అనేది మొదటి తలంపు. ఇది వచ్చాక నీకు ఇతర తలంపులు వస్తున్నాయి. ఈ మొదటితలంపు లేకపోతే నీకు ఇతరతలంపులు రావు. నేను ఎవడను అని ఎవరిని అడుగుతున్నాము? మూలతలంపును నీవు ఎవడవు అని అడుగుతున్నాము. ఈ ప్రశ్న వలన మూలతలంపు ఉపసంహరింపబడి, ఉపసంహరింపబడి దాని మూలంలోనికి వెళుతుంది. మూలతలంపును దాని మూలంలో ఉంచటం వలన అది నశిస్తుంది. అంటే మనకు సైతాను తాలుక పీడ వదలిపోతుంది. మీకు ఎటువంటి తలంపులు వచ్చినా ఆతలంపులను రావద్దు అనకండి, అలా అనుకుంటే ఇంకా ఎక్కువగా వస్తాయి. గదిలోనికి వెళ్ళి దేవుడి బొమ్మ వంక చూసి నమస్కారం పెట్టుకొని నాకు ఇటువంటి తలంపులు వస్తున్నాయి అంటే కొద్దిసేపు ఆ తలంపులు ఆగుతాయి కాని మరల నీవు బయటకు వచ్చాక ఆ తలంపులు అన్నీ ముసిరేస్తాయి. నీవు దేవుడా, దేవుడా అంటున్నావు అది కూడా నీ మూలతలంపు కల్పితమే. గాఢనిద్రలో నీకు మూలతలంపు లేదు, అక్కడ దేవుడి స్మరణ కూడా లేదు. ఇక్కడ భగవాన్ ఏమి చేస్తున్నారు అంటే మధ్యవర్తులతో సంబంధం లేకుండా నీ హృదయంలో ఉన్న శాంతిసాగరంలో, ఆనంద సముద్రంలో నిన్ను ముంచటానికి ప్రయత్నం చేస్తున్నారు, ఆనిర్వాణస్థితిని కౌగిలించుకోవటానికి ఇది ఒక ప్రయత్నం. మిమ్మల్ని ఎవరైనా పొగడుతారు అనుకోండి పొగడనీయండి. ఎవరైనా విమర్శిస్తున్నారు అనుకోండి, విమర్శ చేయనీయండి. ఇవి అన్నీ తలంపులే. మీకు ఎన్ని తలంపులు వచ్చినా రానివ్వండి, రండి రండి అని ఆహ్వానించండి. ఎంత గడ్డిమేటు లాంటి కర్మ అయినా విచారణ అనే అగ్గిపుల్ల ముందు అంతా కాలి బూడిద అవుతుంది. మీకు ఎన్ని తలంపులు వచ్చినా ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి అంటే నేనుకు వస్తున్నాయి. ఆ నేనును నువ్వు ఎవరు? ఎక్కడ నుండి వస్తున్నావు? అని ప్రశ్నించటం మొదలుపెడితే అది నెమ్మది నెమ్మదిగా లోపలకు

జరిగి దాని మూలంలోనికి వెళ్ళి అది నశిస్తుంది. మీరు చెప్పేది శాస్త్రీయంగా చెప్పండి అని అడిగితే భగవాన్ ఏమంటున్నారు అంటే ఏది సైన్స్. చీకటిలోనుండి వెలుగులోనికి రావటం, అజ్ఞానం లోనుండి జ్ఞానం లోనికి రావటం, దుఃఖంలో నుండి సుఖంలోనికి రావటం ఇది సైన్సు కాకపోతే ఏది సైన్సు. నువ్వు చావటానికి సిద్ధంగా ఉంటే చావులేనిస్థితికి మేల్కొలుపుతూ ఉంటే అది సైన్సు కాదా! చైతన్యం ఒక్కటే సత్యం. మిగతావి అన్నీ అందులో కల్పించబడ్డాయి. నీకు మూలతలంపు ఉంటే ఈ ప్రపంచం ఉంది, దుఃఖం ఉంది, సంతోషం ఉంది, ఇష్టం ఉంది, అయిష్టం ఉంది అన్నీ ఉన్నాయి. ఈ మూలతలంపు ఎంతనిజమో అవి అన్నీ కూడా అంతే నిజం. ఈ మూలతలంపు మీదే ఖగోళం అంతా ఆధారపడి ఉంది. ఆ మూలతలంపును షేక్ చేసి, దానిని దాని మూలంలోనికి పంపించు అప్పుడు అది నశిస్తుంది. అప్పుడు ఉన్నదంతా నువ్వే.

లోపల ఏదో ఉంది దానిని తెలుసుకోవాలి అని మనం అనుకొంటున్నాము. కొంతమందికి తెలుసుకోవాలనే కాంక్ష ఉండదు. వారికి పుస్తకంతో పనిలేదు. పూర్తిగా తెలుసుకొన్నవాడికి పుస్తకం అక్కరలేదు. ఎవరికి కావాలంటే జ్ఞానసముపార్జన చేసే వారికి అంటే సాధకులకు గ్రంథం కావాలి. నా జీవితానుభవం ఏమిటి అంటే అన్నింటికంటే సజ్జనసాంగత్యం గొప్పది. లౌకికులకు ఎంతదూరంగా ఉంటే అంతమంచిది. లౌకికులతో స్నేహం చేయటం మానకపోతే వారి గుణాలు మనకు వచ్చేస్తాయి. మనం సాధనచేస్తూ లౌకికులతో స్నేహం మానకపోతే మనం ఒక మైలు ముందుకు ప్రయాణం చేసి, మరల 4 మైళ్ళు వెనుకకు వెళుతూ ఉంటాము. అంటే మనం ముందుకు వెళుతున్నామా? వెనుకకు వెళుతున్నామా? మనం ఎంత సాధన చేసినా లౌకికులతో సహవాసం చేస్తూ ఉంటే వారు మనలను పతనం చేస్తారు. మీరు అందరూనాకు అనుచరులు అనుకోండి, మాటవరసకి మీరు అందరు ఒకేసారి నన్ను విడిచిపెట్టేస్తారు అనుకోండి. అప్పుడు నా మనస్సు కదిలింది అనుకోండి నాకు జ్ఞానం లేనట్లు గుర్తు. ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి మనం చనిపోయినప్పుడు ఒంటరిగా ప్రయాణం చేయాలి. అప్పుడు స్నేహితులు, బంధువులు ఎవరూ రారు. ఈ భూమి మీదకు ఒంటరిగా వచ్చాము, మరల ఈ భూమిని విడిచిపెట్టేటప్పుడు ఒంటరిగా వెడతాము. మోక్షం కోసం మీరు శరీరం పోయేదాక ఆగనక్కరలేదు, సైతానును మనం ప్రక్కకు తప్పించగలిగితే ఇప్పడే మోక్షం పొందవచ్చు. నీకు దేహంతోటి, గౌరవాలతోటి, అగౌరవాలతోటి, ఇంద్రియాలతోటి తాదాప్యం వస్తోంది అనుకో ఆ తాదాప్యం పొందే వారు ఎవరు? నీ లోపల ఉన్న చైతన్యం కాదు, ఈ దొంగనేనే దేహంతో తాదాప్యం పొందుతోంది. నువ్వు ఏదైతే కాదో అదే నువ్వు అని అనిపింపచేసేది ఈ దొంగనేనే. నిజమైననేనుకు ఇటువంటి గొడవలు అక్కరలేదు, వారు ఉంటారు అంతే. సత్పురుషుడు కానివాడికి అన్ని గొడవలు కావాలి కాని సత్పురుషుడికి ఏమీ అక్కరలేదు. వారు ఉంటారు. వారుఅలాగ ఉండరు, ఇలాగ ఉండరు. నిజమైన నాన్నగారు బయటలేరు, మీలోపలే ఉన్నారు. నీకు గైడెన్స్ లోపలనుండే వస్తుంది. నీ ఆలోచనలో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఈ పొరపాటు ఉంది, ఇందులోనుండి విడుదలపొందాలి అని నీకు లోపలనుండే గైడెన్స్ వస్తుంది. ఒకసారి రాజాజీ దగ్గర ఎవరో రాముడిని విమర్శిస్తూ మాట్లాడతారు. ఆ విమర్శించేవాడితో రాజాజీ ఏమన్నారు అంటే మనం చిన్నప్పుడు తల్లి పాలుతాగాము. తల్లి పాలు డాక్టరు దగ్గరకు తీసుకొనివెళ్ళి ఇవి మా అమ్మపాలు ఇవి మంచివా, చెడ్డవా అని అడగటం ఎటువంటిదో నీవు రాముడిని విమర్శించటం కూడా అటువంటిదే అన్నారు. ఎవరి నామం స్మరించుకోవటం వలన మనకు మోక్షం వస్తుందో ఆ రాముడు నామం స్మరించుకోవటం మానివేసి, రాముడిని విమర్శిస్తున్నావా? ఇదేనా నీవు నేర్చుకొన్న విద్య అన్నారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 26-01-2003 | ఆదివారం | జిన్నూరు శ్రీరమణక్షేత్రం |
| 30-01-2003 | గురువారం | గుండుగొలను |
| 08-02-2003 | శనివారం | చించినాడ గీతా మందిరం |
| 19-02-2003 | బుధవారం | గణపవరం సాయిబాబా మందిరం |



**అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం కమిటీ సభ్యులతో సద్గురు శ్రీ నాన్నగారు**

**రమణ భాస్కర చందాదారులకు విజ్ఞప్తి**

రమణ భాస్కర పత్రిక అందనియెడల మొదట మీ పోస్ట్ ఆఫీసులో ఒక్కసారి ఎంక్వైరీ చేయండి. తరువాత మీ అడ్రసు (డోర్ నెంబరు, వీధి, పిన్‌కోడ్), మీ చందా రశీదు నెంబరు తెలియజేస్తూ తదుపరి సంచికలోపు ఎడిటర్, రమణభాస్కర, జిన్నూరు - 234 265కు పోస్టుకార్డు ద్వారా తెలియజేయండి



**అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం ప్రాంగణంలో సద్గురు శ్రీ నాన్నగారు**

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం పట్టణంలో క్షత్రియ కళ్యాణ మండపం ఒక కోటి రూపాయల వ్యయంతో నిర్మాణము జరుగుచున్నది ది।। 7-1-2003 మంగళవారం సద్గురు శ్రీ నాన్నగారు అమలాపురం కళ్యాణ మండప ప్రాంగణమును సందర్శించి రు.50,000 రూపాయల విరాళము ప్రకటించినారు.

భవిష్యత్తులో ఈ కళ్యాణమండప కార్యవర్గ సభ్యులు అందాలసీమ అయిన కోనసీమ ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రయత్నించుచున్నారు. ఈ కళ్యాణ మండపమునకు ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని శ్రీ నాన్నగారు అన్నారు.